# నర్సింగ్ ఆఫీసర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లు

**సుల్తాన్‌బజార్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. సిద్దిపేట మెడికల్ కాలేజీలో సుమారు 100 మంది, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో సుమారు 50 మందిని రాత్రికి రాత్రి డ్యూటీలకు ఆపివేయడంతో తీవ్ర ఆందోళనకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ మంగళవారం హైదరాబాద్‌కు వచ్చారు. కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కలిసి వినతి పత్రాలు సమర్పించారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి ఉద్యోగాలు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్మనెంట్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో పనిచేసిన వీరిని తొలగించడం అన్యాయమన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ డిపార్ట్‌మెంట్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అందరిని యధావిధిగా విధులు కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అధికారులను కోరడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు తొలగించడంతో ఆవేదన చెందుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సిద్దిపేట జిల్లా సీఐటీయూ నాయకులు రవి మరియు నర్సింగ్ ఆఫీసర్స్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు ఉస్మాన్‌బిల్ మహ్మద్ అల్‌హాజరీ

**గోల్కొండ:** కార్వాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిల్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ కుల్సుంపురాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో కలిసి మాట్లాడారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్వాన్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని అన్నారు. ఇందులో భాగంగా తాము కార్వాన్‌లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికను తయారు చేస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు.

# అర్చకులను ప్రభుత్వం ఆదుకోవాలి



చెక్కును అందజేస్తున్న కమిషనర్ అనీల్‌కుమార్ తదితరులు

**సుల్తాన్‌బజార్:** అనారోగ్యానికి గురైన అర్చకులను ప్రభుత్వం ఆదుకోవాలని దేవాదాయ శాఖ ఉద్యోగుల జేఏసీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. మంగళవారం దేవాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచార్య, జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్య, గ్రేటర్ అధ్యక్షులు బండారి జగపతి తదితరులు మాట్లాడుతూ..ముషీరాబాద్‌లోని సీతారామ ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న భార్గవ్‌కు మెదడుకు సంబంధించి సర్జరి జరిగిందన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా ఆయనకు ఖర్చులు భారంగా మారాయన్నారు. ఈ సమాచారం అందుకున్న దేవాదాయ శాఖ జేఏసీ నాయకులు దివంగత గంగు భానుమూర్తి కుమారుడు గంగు కృష్ణచైతన్య భార్గవ్ కుటుంబాన్ని రూ. రెండున్నర లక్షలను ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయనతో పాటు అర్చక ఉద్యోగులు మరో లక్ష రూపాయాలను ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. మొత్తం రూ.3.50 లక్షల చెక్కును కమిషనర్ చేతుల మీదుగా భార్గవ్ సతీమణికి అందించామని వారు తెలిపారు. అలాగే ఆయన కుటుంబానికి వెల్ఫేర్ బోర్డు నుంచి రూ.5 లక్షలను సహాయం చేసేవిధంగా సహకారం అందిస్తామని అదనపు కమిషనర్ కృష్ణవేణి హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

**గౌలిపురా:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. పటేల్‌నగర్‌లో మంగళవారం నూతన సివరేజ్ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో ఇప్పటి వరకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. బస్తీల్లో మురుగునీటి సమస్య ఉందనే విషయాన్ని ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో సంబంధిత జలమండలి అధికారులతో చర్చించి నిధులు మంజూరు ద్వారా రూ.2.50 లక్షలతో అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు. జలమండలిలో నిధులు లేని కారణంగా ఇంకా చాలా బస్తీల్లో సివరేజ్ పైప్‌లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు డి.శ్రీనివాస్, ఎస్.సర్వేశ్ కుమార్, ఆర్.సునిల్ కుమార్, విశాల్, అనిల్ సింగ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్ బాబా, రాజు చారి పాల్గొన్నారు.

# దశలవారీగా బస్తీల అభివృద్ధి: ఎమ్మెల్యే



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

**యాకుత్‌పురా:** దశలవారీగా అభివృద్ధి కార్యక్రమలు చేపడుతున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. రెయిన్‌బజార్ డివిజన్‌లోని ఇమాంబడా బస్తీలో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ బస్తీల్లో పాదయాత్రలు నిర్వహిస్తూ స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఇంజినిరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మునేందర్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు

**జియాగూడ:** దివంగత మాజీ కార్పొరేటర్ మునేందర్ సేవలు చిరస్మరణీయమని ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..2002 జియాగూడ కార్పొరేటర్‌గా ఎన్నికైన మునేందర్ జియాగూడ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. అలాగే ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుబంధ సంస్థల నాయకుడిగా భజన మండలీల అభ్యున్నతికి కృషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంతోష్‌కుమార్, వినయ్ కుమార్, మహేష్ బాబు, జశ్వంత్‌కుమార్, శ్రీకాంత్, బింట్టు, దర్శన్, యాదగిరికి, రాజ్‌కుమార్, భిక్షపతి, గౌతమ్, అర్జున్ పాల్గొన్నారు.

## 'గోషామహల్ సమస్యలను రాజాసింగ్ విస్మరించారు'

**అబిడ్స్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజల సమస్యలను విస్మరించారని నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజాసింగ్ ఎమ్మెల్యేగా గెలిచి రెండున్నర నెలలు కావస్తున్నా గోషామహల్ నియోజకవర్గంలో పర్యటించలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గంలో మిస్సింగ్ అయ్యాడని ఆయన అన్నారు. బీఆర్ఎస్ తరఫున తాను గోషామహల్ ప్రజలకు అండగా ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజలకు అన్ని విధాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషిచేస్తానని గడ్డం శ్రీనివాస్ యాదవ పేర్కొన్నారు.

# కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన తనను కలవడానికి వచ్చిన వారితో పాటు మజ్లిస్ నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. దీనికి అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నానని ఆయన పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో సాంకేతిక కారణాల వల్ల పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అయితే ఈ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తానని ఆయన అన్నారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండి లైన్స్ చౌరస్తా, తూమ్స్ రోడ్, టోలిచౌకీ నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో వరద నీటి పైప్ లైన్‌లు వేయడానికి భారీ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. తవ్వడం, పైపులు వేయడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగుతున్నాయని వాహనాల రాకపోకలకు కూడా దారి మళ్లించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ పనులు పూర్తయితే వర్షం నీరు ఇళ్లల్లోకి చొచ్చుకుపోయే ప్రమాదం ఉండదన్నారు. టోలిచౌకీ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా చూడడమే తన ఆశయమని ఇందుకు గాను అవసరమైన నిధులు సాధిస్తున్నానన్నారు. టోలిచౌకీ చౌరస్తాలో జరుగుతున్న తవ్వకాల కారణంగా షాపులు, హోటల్స్ వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రాఫిక్ కూడా స్తంభించిపోతుందన్నారు. పనులు అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేయడానికి తాను అధికారులకు సూచించడం జరుగుతుందన్నారు. ప్రతి నిత్యం ఈ పనులను తాను పరిశీలిస్తున్నానన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు అబీబ్‌చౌష్, బేగ్ తదితరులున్నారు.

## రేపటి నుంచి విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు

**గౌలిపురా:** గౌలిపురా మార్కెట్ రాంసింగ్‌బాడలోని బంగారు మైసమ్మ మహంకాళి ఆలయంలో ఈ నెల 22 నుంచి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 22న ప్రారంభమై 24వ తేదీ వరకు ఈ మహోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. 22న ఉదయం 9 గంటలకు మంగళవాయిద్యం, చతుర్వేద స్వస్తి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నాంది, అంకురారోహణం, పంచగవ్యమేళనం, 23న ఉదయం 8.30 గంటల నుంచి స్వస్తి వాచనం, స్థాపిత దేవతా పూజలు, నవగ్రహ మాతృక, యోగిని, వాస్తు క్షేత్రపాలక, బ్రహ్మాది మండల దేవతా మంత్ర వహనం, దీక్ష హక్షమం, 24న జగద్గురువులు హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వర్యులు విద్యారణ్య భారతీ మహా స్వామి సువర్ణ కరములతో యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, శాంతి పౌష్టిక మంత్ర వహనం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## శుభాకాంక్షలు




**చార్మినార్:** బీఆర్ఎస్ పార్టీ తరఫున కొత్తగా నియమితులైన రవి చందర్‌ను చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహ్మద్ సలావుద్దీన్ లోధీ మాట్లాడుతూ..రాబోయే ఎంపీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహం చెందాల్సిన అవసరం లేదన్నారు.

## నియామకం



మంగళారపు రాందాస్

**నాంపల్లి:** బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయం కో ఇన్‌చార్జిగా నాంపల్లి నియోజకవర్గానికి చెందిన మంగళారపు రాందాస్ నియమితులయ్యారు. మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళారపు రాందాస్ మాట్లాడుతూ..ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయం కో ఇన్‌చార్జిగా తనను ప్రకటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడాకారులకు చేయూతనివ్వండి



డాక్టర్ సురేఖ

**అబిడ్స్:** క్రీడాకారులకు జీహెచ్ఎంసీ చేయూతనివ్వాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ బి.సురేఖ పేర్కొన్నారు. మంగళవారం ట్యాంక్‌బండ్ జీహెచ్ఎంసీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. మేయర్‌ను, కమిషనర్‌ను పలు ప్రశ్నలు వేసి నిలదీశారు. గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో ఉన్న విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ప్రతి సంవత్సరం ఈవీఎం మిషన్స్ పెట్టడం ద్వారా క్రీడాకారులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో అబిడ్స్ నేతాజీనగర్‌లో, ఆదర్శనగర్ ప్రాంతాల్లో వరదలు వస్తున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదన్నారు. గన్‌ఫౌండ్రీలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# అనిల్‌కుమార్ యాదవ్‌కు సన్మానం



అనిల్‌కుమార్‌యాదవ్‌ను గజమాలతో సత్కరిస్తున్న గాజుల అంజయ్య

**చార్మినార్:** తెలంగాణ రాజ్యసభ సభ్యులుగా కొత్తగా నియమితులైన ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను మంగళవారం మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల అంజయ్య గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా తండ్రి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ పటిష్ఠం కోసం అనీల్ కుమార్ యాదవ్ నిరంతరం పని చేశారన్నారు. యువతరాన్ని ప్రోత్సహించే విధంగా అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సీటు ఇవ్వండంపై ఆయన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించినందుకు గాజుల అంజయ్య ధన్యవాదాలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



జియాగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జ్ అల్ హాజరి

**జియాగూడ:** జియాగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్ హజరి అన్నారు. మంగళవారం జియాగూడలోని ఇంద్రానగర్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు పి.దర్శన్, ఇన్‌చార్జ్ వినోద్ చౌగ్లేల ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతనంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో రూ.10 కోట్ల నిధులతో ఆసుపత్రి, పాఠశాల రోడ్స్ అండ్ డ్రైనేజీ సమస్యల పరిష్కారం, ఆధునీకరణకు వెచ్చించామన్నారు. ఈ కార్యక్రమంలో కావూరి వెంకటేష్, శోభా పాండే, నర్మద, జగన్‌గౌడ్, వనిత, లక్ష్మణ్, ఆనంద్ ముదిరాజ్, మహేష్ బాబు పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



విద్యాధర్, డీసీ

**అబిడ్స్:** ఆస్తిపన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పర్యటించి ఆస్తిపన్ను వసూళ్లు చేస్తున్నారన్నారు. పాత బకాయిదారులకు, ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసులు కూడా జారీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు రిమైండర్ నోటీసులు జారీ చేస్తున్నామని వివరించారు. గోషామహల్ 14వ సర్కిల్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.90 కోట్ల ఆస్తి పన్ను టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ.48 కోట్లు వసూళ్లు అయ్యాయని వివరించారు. 54 శాతం ఆస్తి పన్ను వసూళ్లు చేశామని, మిగతావి వసూళ్లు చేసేందుకు సిబ్బంది విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి తమతమ ప్రాంతాల అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని విద్యాధర్ సూచించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభం



**దూద్‌బౌలి:** అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం పురానాపూల్ పార్థివాడలో రూ.1.82 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీతో కలిసి ప్రారంభించారు. పార్థివాడ బస్తీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీ లాడ్స్ నిధులతో పాతబస్తీలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు. ఎక్కడ ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకువస్తే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, నాయకులు రహీం, సుధాకర్, అనీల్‌కుమార్, కె.శ్రీనివాస్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

**యాకుత్‌పురా:** హరిబౌళి గజానన వ్యాయామశాల మాతేశ్వరి పోచమ్మ, మహంకాళీ ఆలయ 20వ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకం, చండీ హోమం, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శోభాయాత్రను ఆలయం నుంచి ప్రారంభించి బేలా అశోక్ పిల్లర్, సుధా టాకీస్ చౌరస్తా, రాంబక్షిబండా, శాలిబండా కాశీవిశ్వనాథ ఆలయం, హరిబౌళి చౌరస్తా మీదుగా తిరిగి ఆలయం వరకు నిర్వహించారు. దినేష్, శ్రీధర్, ప్రభునాథ్, శ్రావణ్, ప్రకాష్, విఠల్‌రావు, మన్మోహన్, కిషన్ యాదవ్, అభినావ్, శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వ్యభిచార గృహంపై దాడి

**అబిడ్స్:** వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వారిని గుడిమల్కాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బైరి రాజు, ఎస్ఐ జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. రేతిబౌలి పిల్లర్ నెంబర్: 36 సమీపంలో వ్యభిచార గృహాన్ని నడుపుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ జ్యోతి తన సిబ్బందితో దాడి చేసి మటియో జఖియా ఓతుమన్(24) నిర్వాహకురాలు, జాన్‌పాల్ (33) కస్టమర్, చాండడె సంపైన్ (25), కుయాసిరా మసోల్వా (26) అనే బాధితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరంతా టాంజానియా దేశస్తులని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'రిజర్వేషన్' బిల్లుతో మహిళలకు సమానత్వం'



ప్రత్యేక సంచికను ప్రొఫెసర్లతో కలిసి ఆవిష్కరిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్ తదితరులు

**చార్మినార్:** మహిళల సమానత్వానికి మహిళా రిజర్వేషన్ బిల్లు ఎంతో ఉపయోగపడుతుందని నగర పోలీసు కమిషనరేట్ ఆర్థిక నేరాల విభాగం ఏసీపీ కె.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ సిటీ కాలేజీ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారత దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులపై మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభావం అనే అంశంపై సిటీ కాలేజీ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యం లభించడానికి మహిళా రిజర్వేషన్ బిల్లు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సీతారామ్, డాక్టర్ విప్లవ దత్ శుక్లా, డాక్టర్ ఎజాజ్ సుల్తానా, డాక్టర్ పావని.డాక్టర్ జె.నీరజ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు



మాట్లాడుతున్న సదర్‌ఖాజీ అలీముద్దీన్

**గోల్కొండ:** కౌన్సెలింగ్ ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చునని గోల్కొండ ఓజన్ సదర్‌ఖాజీ మహ్మద్ అలీముద్దీన్ బైజీద్ హుస్సామీ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని సదర్‌ఖాజీ కార్యాలయంలో ఆయన పలువురికి కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కార్యాలయంలో రెండు దశాబ్దాలుగా ఎన్నో దంపతుల సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో హాజీ మహ్మద్ అబ్దుల్ రహీం రషీదీ, ఆఫెజ్ ఖాజీ మహ్మద్ హామేద్, ఆఫెజ్ ఖాజీ మహ్మద్ ఇస్మాయిల్ తదితరులున్నారు.

## 'అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించం'



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

**సుల్తాన్‌బజార్:** డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌పై నిరాధారమైన ఆరోపణలను మెడికల్ జేఏసీ నాయకులు బి.వెంకటేశ్వర్ రెడ్డి, యాద నాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, వేణుగోపాల్ గౌడ్, కిరణ్‌రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా మంగళవారం డీహెచ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో జ్ఞానేశ్వర్, సలీముద్దీన్, పాండునాయక్, తిరుపతి నాయక్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధి బీజేపీకే సాధ్యం



పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఈటల రాజేందర్

**గోల్కొండ:** ఆలయాల పరిరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి ఒక్క బీజేపీకే సాధ్యమని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన ఉప్పర్‌బస్తీలోని ఆలయాన్ని సందర్శించారు. బాలాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం, మరకత లింగం, నవగ్రహాలు, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



**నాంపల్లి:** మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల వీడ్కోలు ఉత్సాహంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ గొలమారి పుష్పలీల స్వాగతోపన్యాసంతో సభా కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, విశిష్ట అతిథులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ విజయరాణి, సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ దయా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనూప్ రూబెన్స్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## సత్కారం



**అబిడ్స్:** రాజ్యసభకు నూతనంగా ఎంపికైన అనిల్‌కుమార్ యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నూతన ఎంపీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..తాము పార్టీలు వేరైనా కుటుంబ పరంగా కలిసి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బజ్జు పహిల్వాన్, రూపా వస్తాద్, రాజుభాయ్, కిరణ్, శ్రీనివాస్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ సలీం, గౌస్, అక్బర్‌అలీ షరీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం



**అబిడ్స్:** టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి అటెండర్లకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, జిల్లా సహా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, మహ్మద్ ముజీబ్, శంకర్, ఆసుపత్రి కార్యదర్శి శివకుమార్, కోశాధికారి శేఖర్, మహ్మద్ వహీద్, ముస్తఫా, షరీఫ్, హబీబ్, చావూష్ పాల్గొన్నారు.